

కేటీకే ఓసీ-3 ఉపరితల గనిని పరిశీలిస్తున్న డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్

## కేటీకే ఓసీ పరిశీలన

కృష్ణకాలనీ, అక్టోబర్ 29: భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ-2, ఓసీ-3 గనులను డైరెక్టర్ ఆపరేషన్ ఎన్వీకే శ్రీనివాస్, ఏరియా ఇన్‌చార్జి జీఎం బండి వెంకటయ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు కేటీకే ఓసీ-2, ఓసీ-3 గను వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి గని ప్లాన్లను పరిశీలించి, ఉపరితల గనుల్లో జరుగుతున్న పని విదానాల స్థితి గతులను, యంత్రాల పని తీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసకున్నారు. డైరెక్టర్ ఆపరేషన్ ఎన్వీకే శ్రీనివాస్ మాట్లాడుతూ భూపాలపల్లి ఏరియాలో సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను ఛేదించడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేసుకొని, రక్షణతో కూడుకున్న ఉత్పత్తిని సాధించాలన్నారు. సంస్థలో ఉద్యోగులందరూ సమష్టిగా పని చేస్తూ, ఉత్పత్తి శాతాన్ని పెంచి, కంపెనీ మనగుడకు తోడ్పడాలన్నారు. ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారం, ఎస్వోటూ జీఎం ఎన్వీ రావు, ప్రాజెక్టు అధికారి వెంకటరామిరెడ్డి, పాల్గొన్నారు.

## మాన్యువల్ సవరణకు సానుకూలం

గోదావరిఖని, అక్టోబర్ 29: సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ మాన్యువల్-2023లో 15 సవరణలు చేసేందుకు ఆ సంస్థ డైరెక్టర్ (పా) ఫైనాన్స్, సివిల్ జీఎంలు సానుకూలత వ్యక్తం చేసినట్లు సివిల్ కాంట్రాక్టర్స్ ఆల్ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కనుకుల మొండయ్య తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వారిని ఆదివారం కలిసి విన్నవించినట్లు తెలిపారు. సివిల్ కాంట్రాక్టర్స్ మాన్యువల్-2023లో కొత్త నిబంధనల ద్వారా 11 ఏరియాల కాంట్రాక్టర్లలో చాలా మంది చిన్న చిన్న పనులు చేసేవారే ఉన్నారనీ, వారిని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక భారం మోపకుండా సవరణ చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమస్య పూర్తిగా పరిష్కారం తర్వాతే టెండర్ల ప్రక్రియలో పాల్గొంటామని చెప్పినట్లు తెలిపారు.

## బీఆర్ఎస్వీ ప్రతినిధుల సమావేశానికి తరలిన నాయకులు



తెలంగాణ భవన్‌లో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో మంచిర్యాల నియోజకవర్గం నాయకులు

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 29: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కో-ఆర్డినేటర్స్, నియోజకవర్గాల ప్రతినిధుల సమావేశానికి నస్పూర్ ప్రాంతానికి చెందిన పలువురు నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్వీ మంచిర్యాల నియోజకవర్గం అధ్యక్షుడు దగ్గుల మధుకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్ ప్రాంత నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌ను నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలు, మ్యానిఫెస్టోపై విస్తృత చర్చ జరపాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు కొసాగాలంటే, గులాబీ జెండా ఎగరాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయి, చిప్పకుర్తి జగన్, మహ్మద్ సాజిద్ చోటు, కిరీటి, నక్క తిరుపతి, సాజిద్, ఎగ్గణ సాయికిరణ్, చిట్టి బాద్షా, అంజత్‌ఖాన్, శ్రావణ్, ప్రవీణ్, తదితరులున్నారు.

# వారసత్వ ఉద్యోగాలు కేసీఆర్ ఘనతే..

- వేలాది మంది కార్మికుల పిల్లలకు దారి చూపారు
- డిస్మిస్ కార్మికులకు న్యాయం చేశారు
- పెండింగ్‌లో ఉన్న వారికి గెలిచాక ఉద్యోగాలిప్పిస్తా
- పదేళ్లలో కార్మికులకు అనేక హక్కులు సాధించాం
- నెల రోజులు నా కోసం పనిచేయండి.. ఐదేళ్లు మీకు అండగా ఉంట
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- సింగరేణిలో 'కారుణ్య'ంతో మహిళలకు ఉద్యోగాలు : మిర్యాల రాజిరెడ్డి
- ఘనంగా టీబీజీకేఎస్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పక్కన మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థలో జాతీయ కార్మిక సంఘాలు హరించిన వారసత్వపు ఉద్యోగాల హక్కును సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాల పేరుతో తిరిగి సాధించి వేలాది మంది కార్మికుల పిల్లలకు దారి చూపారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య అధ్యక్షతన టీబీజీకేఎస్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్రను మరోమారు గెలిపించుకుంటామని టీబీజీకేఎస్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏఐటీయూసీ నుంచి సుమారు 50 మంది టీబీజీకేఎస్‌లో చేరారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కారుణ్య నియామకాలతో ఉద్యోగాలు ఇప్పించి వారి కుటుంబ భవిష్యత్‌కరు భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. సీఎం కేసీఆర్ నిర్ణయాలతో సింగరేణి సంస్థ లాభాల బాటలో ఉందన్నారు. భూపాలపల్లిలో కార్మికులకు ఎలాంటి కష్టం వచ్చినా ముందున్నానని, పదేళ్లలో కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిందన్నారు. 16శాతం ఉన్న లాభాల వాటాను సీఎం కేసీఆర్ 32 శాతానికి పెంచారని, కార్మికులకు డబుల్ బెడ్‌రూం క్వార్టర్లను నిర్మించి ఇచ్చారని గుర్తు చేశారు. గైర్హాజర్‌తో ఉద్యోగం పోగొట్టుకున్న కార్మికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేశామన్నారు. ఈ నెల రోజులు తన గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని, ఐదేళ్లు తమ వెంట ఉండి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు కృషి చేస్తానని, డిసెంబర్ 27న జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ గెలుపు బాధ్యత తన భుజాలపై వేసుకుంటానన్నారు. టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడిగా పనిచేసిన కొక్కుల తిరుపతి మృతి పార్టీకి, యూనియన్‌కు తీరని లోటన్నారు. ప్రస్తుతం యూనియన్ బాధ్యతలను బడితెల సమ్మయ్యకు అప్పగించారని, సింగరేణి కార్మికులు, కుటుంబాల నుంచి మెజార్టీ ఓట్లు వేయించే బాధ్యత సమ్మయ్యదే అని పేర్కొన్నారు.



టీబీజీకేఎస్‌లో చేరిన నాయకులను ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బస్వరాజు సారయ్య

***'కారుణ్య'ంతో మహిళలకు ఉద్యోగాలు : టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి***

సింగరేణిలో భర్త చనిపోతే మాత్రమే భార్యలకు ఉద్యోగాలు ఇచ్చేవారని, సీఎం కేసీఆర్ కారుణ్య నియామకాల నిర్ణయంతో యువతతో పాటు అమ్మాయిలకు బొగ్గు గనుల్లో పనిచేసే అవకాశం వచ్చిందని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి అన్నారు. కారుణ్య నియామకాలతో సుమారు 600 నుంచి 700 మంది వరకు అమ్మాయిలు ఉద్యోగాలు చేస్తున్నారని, ఏ బొగ్గు పరిశ్రమల్లో ఈ అవకాశం లేదన్నారు. సింగరేణి కార్మికుల కుటుంబంతో పాటు తల్లిదండ్రులకు సైతం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్న ఘనత సింగరేణికే దక్కుతుందన్నారు. గండ్ర వెంకటరమణారెడ్డి జోక్యంతోనే భూపాలపల్లిలో కార్మికులకు 996 డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు నిర్మించారని, అనంతరం సత్తుపల్లిలో 400 క్వార్టర్లు నిర్మించారన్నారు. గండ్ర వెంకటరమణారెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉంటారని, కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన 10 హామీలను విజయవంతంగా అమలు చేశారన్నారు. కారుణ్య నియామకాల పేరుతో సింగరేణిలో సీఎం కేసీఆర్ కార్మికుల సంఖ్యను పెంచారన్నారు. కోలిండియాలో ఆరున్నర లక్షలు ఉన్న కార్మికులు రెండు లక్షలకు ఎలా తగ్గారని ప్రశ్నించారు. కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలను గెలిపించుకుంటేనే సింగరేణి సంస్థకు మనుగడ ఉంటుందని, నిత్యం కార్మికుల వెన్నంటి ఉండే గండ్ర వెంకటరమణారెడ్డిని కార్మికులు అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సిద్ధు, టీబీజీకేఎస్ ఏరియా ఫిట్ సెక్రటరీలు కొచ్చర్ల రవికుమార్, గాజె సాంబయ్య, బాసినపల్లి కుమార్, ప్రేమ్‌సింగ్, గోవిందుల రాంచందర్, పెనుగొండ మురళి, అధికార ప్రతినిధి దేవరకొండ మధు, నేతలు జక్కిరెడ్డి, రఘోత్తంరెడ్డి, రత్నం సమ్మిరెడ్డి, అన్నాడి మల్లారెడ్డి, నల్లబెల్లి సదానందం, బత్తుల వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, రూప్‌సింగ్, చక్రపాణి, సమ్మిరెడ్డి, శర్మ, జగత్‌రావు, నగేశ్ నేత, వెంకన్న, అవినాశ్‌రెడ్డి, సురేశ్, రాజిరెడ్డి, అనూష, అరుణ, ఉదయశ్రీ, స్వప్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

- నాగజ్యోతి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి
- ఎమ్మెల్యే లేకున్నా జిల్లాను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌ది
- ఉద్యమకారులకు సముచిత న్యాయం కల్పిస్తాం
- కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తాం
- ఎమ్మెల్సీ, ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

గోవిందరావుపేట, అక్టోబర్ 29: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి, పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్సీ, ములుగు నియోజకవర్గ ఇన్నికల ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం గోవిందరావుపేటలో కమ్మ సంఘం ఫంక్షన్‌హాల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు సూరపనేని సాయికుమార్ అధక్షతన నిర్వహించి బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ ప్రాంత ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ములుగును జిల్లాగా మార్చి, అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. ఇటీవల మల్లంపల్లిని మండలంగా, ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం హర్షనీయమన్నారు. జిల్లా కేంద్రంలో 300 పడకల దవాఖానతోపాటు మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తారని, దీంతో జిల్లాలోని మెడిసిన్ విద్యార్థులకు సీట్లు వస్తాయన్నారు.

***ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తాం***

తెలంగాణ ఉద్యమ కారులకు ప్రభుత్వం సముచిత న్యాయం కల్పించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో నేడు బడే నాగజ్యోతి గెలుపునకు ఇంటింటా ప్రచారం నిర్వహించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తించి వారికి సముచిత న్యాయం కల్పిస్తామని, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంగళవారం మండలంలో ప్రారంభించనున్న నాగజ్యోతి ప్రచార కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, పార్టీ మండల ఇన్‌చార్జి సాంబారి సమ్మారావు, జడ్పీటీసీ తుమ్మల హరిబాబు, ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యుడు బూర సురేందర్, ప్రజాప్రతినిధులు, సమన్వయ కమిటీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన మాజీ జడ్పీటీసీ

ములుగు, అక్టోబర్29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి చెందిన గోవిందరావుపేట మాజీ జడ్పీటీసీ ఉప్పుతల కోటి ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో బడే నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా పనిచేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట రోడ్డు భవనాల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, మాజీ జడ్పీచైర్మన్ సాంబారి సమ్మారావు, నాయకులు వేముల భిక్షపతి, రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, ఆకుతోట చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



కోటికి కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మెట్టు శ్రీనివాస్, సమ్మారావు